క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్థానిక కుమ్మరిగట్టు వద్ద కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: స్థానిక కుమ్మరిగట్టు సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ తొలి వార్షికోత్సవాన్ని శనివారం వరసిద్ధి వినాయక ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన విగ్రహ దాతలు అంకాల వెంకట్, పార్వతీదేవిలు అభిషేకాలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడికి గరికపూజలు చేసి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తాంజనేయ బృందం రామ సంకీర్తనలు ఆలపించింది. కళాకారులను ఆలయ కమిటీకి చెందిన కొండేపాటి రామకృష్ణ, సోంబాబు, తదితరులు శాలువా కప్పి సన్మానించారు.

శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన



బోడిగూడెంలో లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

పోలవరం రూరల్: కార్తీకమాసం శనివారం వెంకటేశ్వరస్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పోలవరం మండలం బోడిగూడెం గ్రామంలో శ్రీగిరి కొండపై అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ ధర్మకర్త బూరుగు వెంకటేశ్వరరావు అన్నప్రసాద వితరణ చేశారు. పట్టిసం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శివునికి పంచామృతాభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు చేశారు. మహిళలు సామూహిక పూజల్లో పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన పట్టిసం

గోదావరి నది మధ్యలో గల పట్టిసం శివక్షేత్రంలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించి సామూహిక పూజల్లో పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు

జంగారెడ్డిగూడెం: బ్యాంకు ట్రాన్సాక్షన్స్, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ వంటి విషయాల్లో పాస్వర్డ్, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని హ్యాకింగ్ ఇటీవల ఎక్కువైందని, ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు అన్నారు. ఆయన అధ్యక్షతన స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంగారెడ్డిగూడెంలో అంతర్జాతీయ కంప్యూటర్ సెక్యూరిటీ డే నిర్వహించారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ నేటి సమాజం అంతా కంప్యూటర్ రంగంలోనే ఆధారపడి ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కామర్స్ ఇన్‌చార్జి కె.ఉత్తమ్ సాగర్, కంప్యూటర్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి జె.రాజా శ్రీకాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, జి.శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత కార్తీక వన సమారాధన



గుర్వాయిగూడెంలో మానవత రీజియన్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మానవత కమ్యూనిటీ హాల్లో మానవత రీజియన్ మీటింగ్, కార్తీక వన సమారాధన కార్యక్రమాలు శనివారం మానవత మండల అధ్యక్షులు అయినల రమణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. మానవత జిల్లా కేంద్ర కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, ఎడిటోరియల్ చైర్మన్ రామిశెట్టి గంగాధర్‌రావు, ఆడిట్ కమిటీ చైర్మన్ దల్లి కేదారేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మానవత నిర్వహించే సేవా కార్యక్రమాలను వివరించారు. సుధాగాని రవిశంకర్ నారాయణ, సుధాగాని గీతా నారాయణ మానవతకు అంబులెన్స్ ఏర్పాటు, నిరుద్యోగులకు కోచింగ్ ఇవ్వడానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందేశారు. కార్యక్రమంలో మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, రీజియన్ కన్వీనర్ త్రిపుర రమేష్, ఉపాధ్యక్షుడు అల్లూరు రామకృష్ణ, కోశాధికారి ఇమ్మంది మాధవరావు, సెక్రటరీ గద్దే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

- ఎనిమిదేళ్ల అనంతరం ఈనెల 8న ఎన్నికలు
- కొయ్యలగూడెం సబ్ డివిజన్‌లో 56 సంఘాలకు ఎన్నిక



పీడబ్ల్యూడీ సబ్ డివిజన్ ప్రధాన కార్యాలయం



బందకట్టు డ్యాం

కొయ్యలగూడెం: సాగునీటి సంఘాల ఎన్నికలకు నగారా మోగింది. డిసెంబర్ 8వ తేదీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 2017 సంవత్సరం ఏప్రిల్ నెలలో చివరిసారిగా ఈ ఎన్నికలు నిర్వహించారు. కొయ్యలగూడెం సబ్ డివిజన్ పరిధిలో పోలవరం నియోజకవర్గంతో పాటు తాడేపల్లిగూడెం, గోపాలపురం, నియోజకవర్గాలకు చెందిన పలు మండలాలను ఐదు సెక్షన్లగా విభజించి, 56 సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో సెక్షన్ల వారీగా కొయ్యలగూడెం 12, దేవరపల్లి 5, తాడేపల్లిగూడెం 19, నల్లజర్ల 9, గోపాలపురం 11 సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి ఆరుగురు డైరెక్టర్లను నియమించి, వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకొంటారు. రూ.5 లక్షల్లోపు గ్రాంట్‌తో అభివృద్ధి పనులు స్వయంగా సాగునీటి సంఘాల సభ్యులే నిర్వహించుకోవచ్చు. ఆయకట్టు పరిధిలోని రైతులు మాత్రమే సాగునీటి సొసైటీలను ఎన్నుకోవాల్సి ఉంటుందని జలవనరుల శాఖ పీడబ్ల్యూడీ డీఈ రవీంద్రబాబు తెలిపారు.

సంఘాల ఎన్నికతో అభివృద్ధి

కొయ్యలగూడెం మండలం బందకట్టు సెక్షన్‌లో 3,186 మంది రైతులు సాగుదారులుగా నమోదయ్యారు. సాగునీటి సంఘాల ఎన్నికలు తహసీల్దార్ల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. ప్రతి సెక్షన్‌లో ఎంపికైన గ్రామాల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నిక ఏకగ్రీవం కానిపక్షంలో ఓటింగ్ విధానం అమలు చేస్తారు. సాగునీటి సంఘాల ఎన్నికతో చెరువులు, కాలువల మరమ్మతులు, సాగునీటి డ్యామ్‌ల ద్వారా రైతులకు సాగునీరు అందించే ప్రణాళికలు రూపొందిస్తారు. సంఘాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది.

అక్రమాలకు అడ్డుకట్ట



చెరువుల్లో అక్రమంగా మట్టి తోలకల నియంత్రణకు సాగునీటి సంఘాలు దోహదపడతాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే సాగునీటి అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించే విధంగా సంఘాలు పర్యవేక్షిస్తాయి.

– మద్దిబోయిన శ్రీనివాస్, రైతు, కొయ్యలగూడెం

పదవీకాలం ఐదేళ్లు



డిసెంబర్ 8వ తేదీన ఎన్నికలు తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఫామ్–13ఎ పత్రాలు తహసీల్దార్ కార్యాలయంలో లభిస్తాయి. ఎన్నికైన సంఘాల పదవి కాలం ఐదు సంవత్సరాలు ఉంటుంది.

– ముంగమూరి విజయ భాస్కర్, పీడబ్ల్యూడీ ఏఈ, (గోపాలపురం సెక్షన్)

వర్షాలతో రైతుల్లో ఆందోళన



కొత్తపట్టిసీమలో ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

పోలవరం రూరల్: తుఫాను ప్రభావంతో కురుస్తోన్న వర్షాలతో రైతుల్లో ఆందోళన నెలకొంది. శనివారం ఈదురుగాలులతో కూడిన కొద్దిపాటి వర్షం కురవడంతో కల్లాల్లోని ధాన్యం రాశులపై బరకాలను కప్పి భద్రపరుచుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. కొందరు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని సంచుల్లో నింపి రైస్ మిల్లులకు తరలించారు.

సారా తయారీ, అమ్మకాలపై కఠిన చర్యలు

జంగారెడ్డిగూడెం: సారా తయారీ, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. శనివారం సర్కిల్ పరిధిలోని కుక్కునూరు మండలం దాచారంలో నాటుసారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ నాటుసారా ఆరోగ్యానికి హానికరమన్నారు. విషపూరిత రసాయనాలతో తయారు చేసే వీటిని సేవించి అనారోగ్యపాలు కావద్దని సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మద్యం విక్రేత అరెస్ట్

జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామంలో శనివారం అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



దాచారంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు



రేచర్లలో బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న అధికారులు

రేచర్లలో ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి : చింతలపూడి మండలం రేచర్ల గ్రామ శివారులో సారా శిబిరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కొనుసోతు అంజలి, ఇస్లావతు వాసులను అదుపులోకి తీసుకొని, 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరరావు, ఎస్సై రాజేంద్ర, స్థానిక ఎక్సైజ్ ఎస్సై అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద సిబ్బంది నిరసన



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న శానిటరీ సిబ్బంది, స్వీపర్లు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పటల్ శానిటరీ సిబ్బంది, స్వీపర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు టౌన్ కార్యదర్శి ఎస్‌కే సుభాషిని మాట్లాడుతూ మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలన్నారు. తమకు రూ.16 వేల వేతనానికి రూ.2000 పీఎఫ్ నిమిత్తం కట్ అవుతుండగా, రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన రూ.2 వేలు ఏమయ్యాయో తెలియడంలేదని చెప్పారు. వెంటనే సదరు మొత్తాన్ని ఎన్ని నెలలు రావాలో వెంటనే చెల్లించాలని కోరారు. జీఓ 36 ప్రకారం వర్కర్లకు రూ.21 వేలు ఇవ్వాలని, సూపర్ వైజర్లకు రూ.24 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు జతల యూనిఫాం, సబ్బులు, కొబ్బరినూనె, గన్ బూట్లు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు దయామణి, కార్యదర్శి మేరీ, మున్సిపల్ వర్కర్స్ టౌన్ అధ్యక్షుడు రేలంగి నాగరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు, వెంకటేష్, చంద్రకళ, శకుంతల, సీత, వెంకటేశ్వరరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జన సంద్రమైన పారిజాతగిరి



జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్తీక మాసం ఆఖరి శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రభాత కాలంలో సుప్రభాత సేవ, అనంతరం నిత్య ఆరాధన, మంగళ శాసనం మొదలగు కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభము వద్ద, తులసి కోట వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. అబ్బిన దత్తాత్రేయ దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ, మంగిశెట్టిగూడెం గ్రామానికి చెందిన ఓరుగంటి నాగేంద్ర దంపతుల సహకారంతో ప్రసాద వితరణ, పుష్పమాలికా అలంకరణలు చేశారు.

వేంకటేశ్వరునిగా రసలింగేశ్వరుడు

కొయ్యలగూడెం: కన్నాపురంలోని దుర్గాభవాని రసలింగేశ్వర స్వామికి శనివారం వెంకటేశ్వరునిగా విశేష అలంకరణ చేశారు. అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా కమిటీల ఎన్నిక



సభలో మాట్లాడుతున్న మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారెడ్డి

వేలేరుపాడు: సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా డివిజన్, మండల స్థాయి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నిర్మాణ జనరల్ బాడీ సమావేశం శనివారం వేలేరుపాడు మండలం మద్దిగట్లలో నిర్వహించారు. జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్కే గౌస్ పార్టీ జెండాను ఆవిష్కరించగా, జిల్లా నాయకులు సిరికొండ రామారావు అమరవీరుల సంతాప తీర్మానాన్ని ప్రతిపాదించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ పోలవరం డివిజన్ కార్యదర్శిగా కట్టం ముత్యాలరావు, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శిగా సోయం చంద్రరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేలేరుపాడు మండల కార్యదర్శిగా కట్టం రాంబాబు, కుక్కునూరు మండల కార్యదర్శిగా కంగాల కల్లయ్య, జీలుగుమిల్లి మండల కార్యదర్శిగా సోడే విజయ, బుట్టాయగూడెం మండల కార్యదర్శిగా తొడం సీత, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శిగా పెరుమాళ్ల శ్రీనులను, కమిటీల సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, గడ్డల ముత్యాలరావు, కట్టం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహాకవి గురజాడకు నివాళి



కుంతల గూడెం ఎంపీయూపీ స్కూల్లో గురజాడకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు



ఏకలవ్య పాఠశాలలో గురజాడకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం కుంతల గూడెం ఎంపీపీ స్కూల్లో హెచ్ఎం రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. సామాజిక రుగ్మతులను తన కవితలు రచనల ద్వారా ఎత్తిచూపి సమసమాజ స్థాపనకు బాటలు వేసిన మహనీయుడు గురజాడ అని రాయపూడి పేర్కొన్నారు. గురజాడ రచనలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: గురజాడ అప్పారావు మహోన్నతమైన వ్యక్తి అని స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా అన్నారు. గురజాడ 109వ వర్ధంతిని ఏకలవ్య పాఠశాలలో డాక్టర్ పోలబాల గణేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని పి.కన్నాపురంలో నలుగురు జూదరులను అరెస్టు చేసి, రూ.3,100 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాళ్లకుంట, సత్తెన్నగూడెం, దొరసానిపాడు, ద్వారకాతిరుమల, కొమ్ముగూడెం, మలసానికుంటలలో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

ఆయుధ డిపో ఏర్పాటుపై పునరాలోచన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ప్రతిపాదిత నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ఏర్పాటుపై పునరాలోచిస్తున్నట్టు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2 వేల కోట్లు అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందనున్నట్టు పేర్కొన్నారు. అయితే స్థానిక ప్రజల మనోభావాలు, పలు సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రక్రియపై పునరాలోచన చేస్తున్నామని వివరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



జంగారెడ్డిగూడెంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ



చింతలపూడిలోని డిగ్రీ కళాశాల వద్ద నినదిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: క్రమ పద్ధతిలేని జీవన విధానం ఎయిడ్స్ వ్యాప్తికి దోహదపడుతుందని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీ కమల మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ వల్ల ఎయిడ్స్ వస్తుందన్నారు. ముఖ్యంగా విశృంఖల శృంగారం, ఒకరికంటే ఎక్కువ మందితో శారీరక సంబంధాలు ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి కారణమవుతోందని వివరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ ఉన్న వారి రక్తం ఇతరులకు ఎక్కించడం వల్ల, తల్లి నుంచి బిడ్డకు, కలుషిత సిరంజీల వల్ల ఎయిడ్స్ సంక్రమిస్తుందని తెలిపారు. హెచ్ఐవీ సోకితే శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోయి జలుబు తదితర రోగాలు వ్యాపిస్తాయన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ వి.రాంబాబు, సునీత, వజ్రకిరణ్, ఆసుపత్రిలోని వైద్యులు, హెడ్ నర్సులు, ఐసీటీసీ, ఏఆర్‌టీ సెంటర్, డీఎస్ఆర్‌సీ సిబ్బంది, రైడ్స్ ఎన్‌జీఓ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేద్దాం

చింతలపూడి : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌ను నిర్మూలిద్దామంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించే వ్యాధి అని అన్నారు. ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జి.జీవన మౌనిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామవరపుకోట: ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ అథారిటీ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సీహెచ్ మధుబాబు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలో జీలకరగ్రూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మధుబాబు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, సరైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎయిడ్స్ నివారణ ఒక్కటే మార్గమని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తడికలపూడి ఎస్సై పి.చెన్నరావు, చింతలపూడి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఎన్ అశోక్ బాబు, అడ్వకేట్లు వెంకటేశ్వరరావు, పణీంద్ర, కామవరపుకోట సెక్టర్ అంగన్‌వాడీ సూపరవైజర్ బి.మంగ దేవి పాల్గొన్నారు.

పింఛన్ కోసం వృద్ధుల పాట్లు



గుంటుపల్లిలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

కామవరపుకోట: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్‌దారులకు ప్రయాస తప్పడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో క్రమం తప్పకుండా వాలంటీర్లు ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేసేవారు. లబ్ధిదారులు ఉన్నచోటికే వెళ్లి పింఛన్ అందజేసేవారు. కామవరపుకోట మండలం గుంటుపల్లిలో శనివారం పింఛను తీసుకోవడానికి వచ్చిన వృద్ధులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు పడ్డారు. పింఛన్ ఇస్తారని చెప్పటంతో ఏలూరులో తన కూతురు వద్ద ఉంటున్నాని దేవరపల్లి వీరమ్మ శనివారం ఉదయాన్నే గుంటుపల్లి వచ్చి పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. స్థానికుడైన రెడ్డి నాగేష్ తన ఇంటి వద్ద ఎదుచూసి ఎదురుచూసి ఎంతకీ అధికారులు రాకపోవడంతో పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. తమను అధికారులెవ్వరూ పట్టించుకోలేదని లబ్ధిదారులు వాపోయారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పోలవరం జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎక్సైజ్ అధికారులు మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్సై ఎల్ శ్రీనివాసులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, నాటు సారా, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు బానిసైతే యువత మానసికంగా, శారీరికంగా, ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతారని వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జి.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పోలవరం రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతిచెందినట్టు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. పోలవరం మండలం గుంజవరం గ్రామానికి చెందిన సున్నం రాంబాబు (46)కు వివాహమై ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలు చిన్నప్పుడే భార్య అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో రాంబాబు మద్యానికి బానిసయ్యాడు. రాంబాబు పిల్లలు అమ్మమ్మ ఇంటి వద్ద పెరిగారు. ఈ నెల 28న అతిగా మద్యం సేవించి వచ్చిన రాంబాబును, అతని కుమారుడు రవీంద్ర మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన రాంబాబు పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే పోలవరం వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 29న రాంబాబు మృతిచెందాడు. రవీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత సత్యనారాయణకు విరాళం బాండ్ అందిస్తున్న సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.2.06 లక్షలను విరాళంగా అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన తమలపూడి వీరవెంకట సత్యనారాయణ రూ.1,06,000, కాకినాడకు చెందిన వేములూరి వీరవెంకట నరసింహారావు రూ.1,00,000 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాలను అందించారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.